



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1200 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# జార్జ్ ఈస్ట్‌మన్

ఇవాళ మనం విశేషాలు తెలుసుకోబోయే ప్రముఖవ్యక్తి 19వ శతాబ్దానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త, పారిశ్రామికవేత్త. ఒక విధంగా చూస్తే శాస్త్రవేత్త కూడా. అన్నింటికీ మించి మహాదాత. 1854 నుంచి 1932 మధ్యకాలంలో 77 సంవత్సరాల పాటు జీవించిన ఈ అమెరికన్ ప్రముఖుడు కాలచక్రాన్ని బొటన వేలుతో ఆపేసే యంత్రాన్ని ఆవిష్కరించిన మాంత్రికుడు. గత కాలాన్ని మెడలు వంచి తీసుకొచ్చి కళ్ళ ముందు నిలపగలిగే విద్యను నేర్చుకున్న ఐంద్రజాలికుడు. మానవజాతి జ్ఞాపకాలకు, తీపిగురుతులకు శాశ్వత రూపం ఇచ్చే ప్రక్రియకు పునాది వేసిన అదృష్టశాలి.

సరిగ్గా చెప్పాలంటే 1879 వరకు నైపుణ్యం గల కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉన్న అత్యంతసంక్లిష్టమైన ఫోటోగ్రఫీని అందరికీ అందుబాటులోకి తెచ్చిన పరిశోధకుడు, ఒక విధంగా శాస్త్రవేత్త. తన పరిశోధన ఫలితాల ఆధారంగా ఫోటోగ్రఫీ పరిశ్రమను స్థాపించి ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసి 20వ శతాబ్దం మొదట్లోనే అంటే 1900 సంవత్సరానికే ప్రపంచ ఫోటోగ్రఫీ పరిశ్రమపై గుత్తాధిపత్యం నెలకొల్పిన అతని పేరు జార్జ్ ఈస్ట్‌మన్. **కోడాక్ కెమెరా** పేరు ఒకటి చాలు చరిత్రలో జార్జ్ చిరునామా తెలుసుకోవడానికి. కలర్ సినిమా వచ్చిన కొత్తలో గేవా కలర్ చిత్రం ఈస్ట్‌మన్ కలర్ చిత్రం అని ప్రచార ప్రకటనలో పేర్కొనేవాళ్ళు. ఈస్ట్‌మన్ కలర్ పేరు జార్జ్ జ్ఞాపకార్థం పెట్టారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే ఆధునిక ఫోటోగ్రఫీకి పితామహుడు ఆయన.

ఒక దశాబ్దం క్రిందటి వరకు ఫిలిం కెమెరాలు, వాటిలో ఫిలిం వాడుతుండే వాళ్ళం. అలాగే సినిమా చిత్రీకరణకు వాడిన రోల్ ఫిలిమ్స్ అన్నిటికీ పునాది 140 సంవత్సరాల క్రిందటే జార్జ్ ఈస్ట్‌మన్ చేసిన పరిశోధనా ఫలితాలే. ఆయన ఫోటోగ్రఫీ రంగంలో చేసిన వినూత్న ఆవిష్కరణలు ఆ రంగానికి మాత్రమే పరిమితం కాలేదు. అవి ఖగోళశాస్త్రం, వైద్యరంగం, జర్నలిజం, విద్యారంగం, వినోదరంగం లాగా ఎన్నో కోణాల్లో విప్లవాత్మక మార్పులకి మూలకారణం అయ్యాయి. ఆయన ఫోటోగ్రఫీ పరిశోధనలు చేస్తున్న రోజుల్లో, ఆ తరువాతి దశాబ్దంలో మానవజాతిని ప్రభావితం చేసిన ఎలక్ట్రిక్ బల్బు, టెలిఫోన్, మోటర్ కార్లు, విమానం, మూవీ ఫిలిం లాంటి ఆవిష్కరణలు అనేకం జరిగాయి. వాటన్నింటికీ కారణం శాస్త్రజ్ఞులు థామస్ అల్వా ఎడిసన్, గ్రహం బెల్, రైట్స్ సోదరులు, హెన్రీ ఫోర్డ్ వీళ్ళందరూ.

అయితే వీళ్ళ కాలంలోనే జార్జ్ ఉన్నప్పటికీ ఈ శాస్త్రవేత్తల పేర్లకు ఉన్నంత ప్రాచుర్యం జార్జ్ ఈస్ట్‌మన్‌కు లభించలేదు. ఈస్ట్‌మన్‌కి మిగతా శాస్త్రజ్ఞులకు తేడా ఉంది. ఈస్ట్‌మన్ శాస్త్రజ్ఞుడు కాని శాస్త్రజ్ఞుడు. ఇతర సైంటిస్టుల లాగా అతను ఏ రంగంలోనూ నిష్ణాతుడు కాదు. యూనివర్సిటీలో చదువుకోలేదు, పీహెచ్‌డీలు లేవు. కనీసం హైస్కూల్ చదువైనా ముగించలేదు.

చల్లారని సంకల్పం తోడుంటే అల్లాదీన్ అద్భుతదీపం అవసరమే లేదని నిరూపిస్తూ కేవలం పట్టుదలతో ఫోటోగ్రఫీలో కొత్త అధ్యాయాలను ఆవిష్కరించాడు. కెమిస్ట్రీ చదవలేదు, కెమికల్స్‌తో ప్రయోగాలు చేశాడు. ఆప్టిక్స్ చదువుకోలేదు. కెమెరా లెన్స్‌ని రూపొందించాడు. అతడు చేసిన ప్రయోగాలకు, సాధించిన ఫలితాలకు పెద్దపెద్ద శాస్త్రజ్ఞులే ఆశ్చర్యపోయారా రోజుల్లో! సాధారణంగా శాస్త్రజ్ఞులు లేబరేటరీలో ప్రయోగాలు చేస్తారు, ఏవో పరిశోధన ఫలితాలు సాధిస్తారు. ఆ తర్వాత వ్యాపారవేత్తలు వాటిని తీసుకుని వాటిమీద వ్యాపారం చేస్తారు. కానీ జార్జ్ ఈస్ట్‌మన్ పరిశ్రమను స్థాపించి, దాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసి, వేలాదిమందికి ఉపాధి కల్పించి అత్యంత విజయవంతమైన పారిశ్రామికవేత్తగా, వ్యాపారవేత్తగా కూడా చరిత్రలో నిలిచి పోయాడు.

కనుక జార్జ్ ఈస్ట్‌మన్ ఒక సంపూర్ణ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త, పారిశ్రామికవేత్త. మిగతా శాస్త్రవేత్తలకి ఈ సంపూర్ణత ఉండేది కాదు. ఆ విధంగా ఈయన ప్రత్యేకత నిలబెట్టుకున్నాడు. ఆయన ఎక్కడా ఎంబీఏ చదువుకోలేదు. కానీ ఈ రోజుల్లో అనేక పరిశ్రమలు అనుసరించే విధానాలను 125 యేళ్ల కిందటే తన పరిశ్రమలో ప్రవేశపెట్టాడు ఆయన. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ వ్యాపారంగంలో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ, పోటీదారులను కొనేస్తూ, ఒక విధంగా ఫోటోగ్రఫీ పరిశ్రమలో ఏకఛత్రాధిపత్యాన్ని తాను జీవించినంతకాలం ప్రపంచవ్యాప్తంగా కొనసాగించాడు.

నాలుగు దశాబ్దాల పాటు నిరంతరం శ్రమించి స్థాపించిన వ్యాపార సామ్రాజ్యం సంపాదించిన ప్రతి పెన్నీని ప్రపంచానికి అంకితం చేసిన విలక్షణ, స్ఫూర్తిదాయక ప్రముఖుడు జార్జ్ ఈస్ట్‌మన్. అమెరికా న్యూయార్క్ రాష్ట్రంలోని రాంచెస్టర్ నగరంలోని ప్రతి అంగుళమూ ఆయన వదిలి వెళ్ళిన ముద్రలతో నిరంతరం పులకిస్తూనే

ఉంటుంది. తను జీవించిన కాలంలో ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. ఎవరికీ తన వ్యక్తిగత జీవిత విశేషాలు తెలియనివ్వలేదు.

యం.ఐ.టి. కి మిలియన్ల డాలర్లు విరాళాలు ఇచ్చిన 1911 ప్రాంతాలలో ఒక షరతు పెట్టాడు. నా పేరు ఎవరికీ తెలియనివ్వకూడదు అని. పదేళ్ల తరువాత ఎవరో ఆకాశరామన్న మిస్టర్ స్మిత్ మిలియన్ల డాలర్లు ఇస్తున్నాడని తెలిపాడు. మిస్టర్ స్మిత్ పేరుతో ప్రశంసా గీతాలు పాడుకునే వాళ్ళు యం.ఐ.టి. విద్యార్థులు. 1920 తర్వాత ఆయన ఎవరో కాదు జార్జ్ ఈస్ట్‌మన్ అని అందరికీ తెలిసింది.

పెద్దకంపెనీ యజమాని అయి మల్టీ మిలియనీర్ అయినప్పుడు కూడా వీధిలో అతి సామాన్యుడిలాగా నడిచి వెళ్లేవాడు. లండన్ వెళ్ళినప్పుడు సైకిల్ మీద తిరిగేవాడు. ఫొటోగ్రఫీకి ఆయన పితామహుడు. కానీ ఆయన దిగిన ఫోటోలు ఎక్కువగా లభ్యం కావడం లేదు. ''రోజంతా ఉద్యోగంలో, వ్యాపారంలో నువ్వు చేసే పని నీ రాబడి చెబుతుంది. ఆఫీస్ అయిపోయాక నువ్వు చేసే పని **'నువ్వు ఏమిటో నీకు తెలియజేస్తుంది'** అని నమ్మిన జార్జ్ ఈస్ట్‌మన్ రోజంతా కష్టపడేవాడు. ఆఫీస్ అయిపోయాక సంపాదనంతా ఎలా దానధర్మాలు చేయాలో ఆలోచిస్తుండేవాడు. అదీ జార్జ్ ఈస్ట్‌మన్.

ఈస్ట్‌మన్ జీవితం పుట్టిన దగ్గర నుంచి ఆత్మహత్య చేసుకునే 77 సంవత్సరాల వరకు ఎక్కడికి అక్కడ మలుపులు, మెరుపులు, అవరోధాలు, పోరాటాలు, విజయాలు–అడుగడుగునా స్ఫూర్తిదాయక సంఘటనలు.

నేను చేయాల్సిన పనులన్నీ చేసేసాను, 'ఇంకెందుకు జీవించడం!' అని ఒక చిన్న నోటు రాశాడు అంతే.

ఆయనను సమగ్రంగా తెలుసుకోవాలంటే కొన్ని గంటలు కావాలి. ఆయన జీవిత ముఖ్య ఘట్టాలనే చూద్దాం.

జార్జ్ ఈస్ట్‌మన్ నాన్న పేరు జార్జ్ వాషింగ్టన్ ఈస్ట్‌మన్, అమ్మ పేరు మరియా. నాన్నకు న్యూయార్క్ రాష్ట్రంలోనే వాటర్ వెల్లీ అనే చిన్న ఊర్లో 10 ఎకరాల పొలం ఉండేది. నర్సరీలో పూల మొక్కలు, పండ్ల మొక్కలు అమ్ముతుండేవాడు. ఈస్ట్‌మన్ వాషింగ్టన్ బాగా చదువుకున్నాడు. వాళ్ళ ఊరికి 100 మైళ్ళ దూరంలో రాంచెస్టర్ నగరంలో అకౌంటింగ్, బుక్ కీపింగ్ నేర్పే ఒక స్కూల్ నడిపాడు. అకౌంటింగ్‌లో కొన్ని పుస్తకాలు కూడా రాశాడు. వారం రోజులు రాంచెస్టర్‌లో స్కూల్ నడపడం, శని ఆదివారాలు వాళ్ల ఊరు వెళ్లి నర్సరీ చూసుకోవటం.

జార్జ్ ఈస్ట్‌మన్ 1854 జులై 12న పుట్టాడు. అతనికంటే ముందు ఇద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్ళల్లో ఒక అమ్మాయికి చిన్నతనంలోనే పోలియో రావడంతో ఎక్కువ సమయం చక్రాల కుర్చీలోనే ఉండేది. జార్జ్ ఈస్ట్‌మన్ పెంపకం వాళ్ళ అమ్మగారే చూసుకునేది. కనుక తండ్రి కంటే తల్లితో ఎక్కువ అనుబంధం పెరిగింది. ఈస్ట్‌మన్ పుట్టిన ఆరేళ్ళకి, 1860లో కుటుంబం మొత్తాన్ని రాంచెస్టర్‌కి మార్చేశాడు వాళ్ళ నాన్న. ఆయన బాగా కష్టపడేవాడు. పిల్లలకు, భార్యకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకొనేవాడు. ఈస్ట్‌మాన్‌ని కూడా చిన్నప్పుడే ఖరీదైన పబ్లిక్ స్కూల్లో

చేర్పించాడు. వాళ్లు రాంచెస్టర్ వచ్చిన రెండేళ్లకి 1862 ఏప్రిల్‌లో వాళ్ళ నాన్న గుండె జబ్బుతో హఠాత్తుగా మరణించాడు.

అప్పుడు బయటపడింది. ఆయన ఆస్తులు ఏమీ మిగల్చలేదు అని. అంతవరకు వాళ్ళు అన్ని సౌకర్యాలతో ఏ ఇబ్బంది లేకుండా జీవిస్తున్నారు. అమ్మ, అక్కయ్యలు, అతను, ఒక్కసారిగా పేదరికం అంగీకరించక తప్పలేదు. ముగ్గురు పిల్లల్ని పోషించడానికి వాళ్ళ అమ్మ నెలవారి భోజనాలు పెట్టే ఒక బోర్డింగ్ హోమ్ మొదలుపెట్టింది. భోజనాలకు దూరాల నుంచి వచ్చేవాళ్లు. ఈస్ట్‌మాన్ కూడా పబ్లిక్ స్కూల్ మానేసి మామూలు స్కూల్‌కి వెళ్లడం మొదలుపెట్టాడు. పదేళ్లు దాటకముందే జీవితంలో పేదరికం, కష్టాలు ఎలా ఉంటాయో చూస్తూ పెరిగాడు. 14 –15 సంవత్సరాలు వచ్చేసరికి పోలియోతో చక్రాల కుర్చీలో ఉండే అక్క చనిపోయింది. ఆ కుటుంబానికి అది మరొక పెద్ద దెబ్బ. ఇంకో అక్క స్కూల్ మానేసి వంటలు చేయడంలో అమ్మకి సహాయం చేస్తూ ఉండేది.

జార్జ్ ఈస్ట్‌మన్ తను కూడా స్కూల్ మానేస్తాను అని అమ్మతో చెప్పాడు. తల్లి ఏమీ చేయలేక నిస్సహంగా ఉండిపోయింది.

తన 14 సంవత్సరాల వయసులో 1868 మార్చి 9న ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో మెసెంజర్ బాయ్‌గా ఉద్యోగం మొదలు పెట్టాడు జార్జ్ ఈస్ట్‌మన్. జీతం వారానికి మూడు డాలర్లు అతి జాగ్రత్తగా వాడుకుంటూ దానిలోనే తల్లికి కూడా సహాయం చేసేవాడు. ఒక సంవత్సరం తర్వాత మరొక ఇన్సూరెన్స్ కంపెనీలో చేరాడు. మెసెంజర్ బాయ్ నుంచి ఆఫీస్ బాయ్‌గా. జీతం వారానికి ఐదు డాలర్లు. సొంతంగా ఇన్సూరెన్స్ పాలసీలు అమ్మడం కూడా మొదలు పెట్టాడు. ఫైర్‌మాన్‌గా కూడా పనిచేశాడు. నాన్న హఠాత్తుగా చనిపోయినప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు చూసి చిన్న వయసులోనే బాగా సంపాదించాలి, భవిష్యత్తులో ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులు పడగూడదని అతని లక్ష్యం. సంపాదించిన, ఖర్చు పెట్టిన ప్రతి పెన్నీ కూడా అతి జాగ్రత్తగా లెక్కలు రాస్తుండెవాడు. కొడుకు అంతగా కష్టపడడం తల్లి చూడలేకపోయింది. కానీ ఆమెది ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. రాత్రిపూట వాళ్ళ నాన్న వదిలి వెళ్ళిన అకౌంటు పుస్తకాలు సొంతంగా చదివి లెక్కలు వంట పట్టించుకున్నాడు. సంపాదన కోసం చెక్కలతో చిన్న చిన్న పజిల్స్ చేసి స్కూల్ పిల్లలకి, చెక్క బీరువాలు పెద్దవాళ్ళకి అమ్మేవాడు. అయిదారు ఏళ్లు గడిచింది.

1877లో అంటే జాబ్ ఈస్ట్‌మన్‌కి 23 సంవత్సరాల వయసులో ఆయన నేర్చుకున్న అకౌంటింగ్ పాఠాలు ఆధారంగా రాంచెస్టర్ సేవింగ్స్ బ్యాంక్ బ్యాంకులో జూనియర్ గుమాస్తా ఉద్యోగంలో చేరాడు. జీతం వారానికి 15 డాలర్లు. ఇన్సూరెన్స్ పాలసీలు ఎలాగో అమ్ముతూ ఉద్యోగంలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్నాడు. ఇంకా తల్లికి భోజనశాల నిర్వహణ తప్పడం లేదు. 1877 ప్రాంతాల్లో అమెరికన్ నేవీ డేస్ ఒకటి కరేబియన్ ఐలాండ్స్‌లో పెడుతున్నారు అని తెలిసింది. అక్కడ రియల్ ఎస్టేట్ బాగా పెరుగుతుంది. ఇప్పుడు కొని పెట్టుకుంటే చాలా లాభాలు వస్తాయి అని తెలుసుకున్నాడు. స్నేహితులు చెప్పారు '**నీతో పాటు కెమెరా కూడా తీసుకెళ్ళు, ఫోటోలు తీసుకురావచ్చు**' అని సలహా నచ్చింది.

ఆ సలహా తర్వాత జార్జ్ ఈస్ట్‌మన్ జీవితాన్నే కాదు, ప్రపంచాన్నే మార్చేసింది. కెమెరా వెంట తీసుకెళ్లడం పెద్ద శ్రమ అనుకుంటాం ఇప్పుడు. కానీ ఆ రోజుల్లో అది సాధారణ విషయం కాదు. కెమెరా ఇప్పట్లో ఉన్న మైక్రోఓవెన్ సైజులో ఉండేది. దాంతోపాటు గాజు పలకలు కెమికల్స్, ట్రైపాడ్ స్టాండ్, ఒక నల్ల దుప్పటి, ఇవన్నీ కలిసి దాదాపు రెండు, మూడు సూట్ కేసుల సరంజామా కావాలి.

ఫోటో దిగాలన్నా, తీయాలన్నా కూడా బ్రహ్మవిద్యగా ఉండేది. ఆ పెద్ద కెమెరా పెట్టెను ట్రైపాడ్ మీద పెట్టాలి. దాని మీద ఒక నల్ల దుప్పటేయాలి. గాజు పలకలు చీకటి గదిలో పెట్టి వాటి మీద కెమికల్స్ పోయాలి. తడి ఆరకుండానే ఆ గాజు పలకను జాగ్రత్తగా హోల్డర్‌లో పెట్టి ఫోటో తీసి మళ్లీ వెంటనే గాజు పలకను బయటకు తీసి వేరే కెమికల్స్‌తో కడగాలి. ఇంత తతంగం ఉండేది ఫోటో తీయాలంటే.

**అదే వెట్ ప్లేట్ టెక్నాలజీ**

తడి గాజు పలకల ఉపయోగిస్తారు కాబట్టి వెట్ ప్లేట్ టెక్నాలజీ. ఒక్క ఫోటో తీయాలంటే 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టేది. గంటకి రెండు మూడు ఫోటోలు మించి తీయడానికి వీలయ్యేది కాదు.

రాచెస్టర్ నగరం మొత్తంలోనే సొంత కెమెరా గల రెండో వ్యక్తి జార్జ్ ఈస్ట్‌మన్ అయ్యాడు. మామూలు వాళ్ళు కొనలేరు. ఆయన కెమెరా కొనడం కోసం సుమారుగా 90 డాలర్లు ఖర్చు పెట్టాడు. అప్పటికి బాగానే సంపాదించి ఉన్నాడు కాబట్టి 90 డాలర్లు ఖర్చు తేలికగానే పెట్టగలిగాడు. కరేబియన్ ఐలాండ్స్ వెళ్లి బాగా సంపాదిద్దాం అనుకున్నాడు. కెమెరా నేర్చుకోవడానికి మరొక ఐదు డాలర్లు ఫీజు ఇచ్చి ట్రైనింగ్ తీసుకున్నాడు. ముందుగా వాళ్ల ఊళ్లో నది దగ్గర కెమెరా వాడి చూశాడు. గాజు పలక మీద కెమికల్స్ పోసేటప్పుడు ఏమాత్రం తేడా వచ్చినా అది పాడైపోతుంది. ఓ పావుగంట ఆగాలి. కెమికల్ ఏ మాత్రం అజాగ్రత్తగా పూసినా వేళ్ళ మీద పడితే మచ్చలు పడేవి, బొబ్బలెక్కేవి. టైమింగ్ చాలా ముఖ్యం. “కెమికల్ పూయడం, కెమెరాలో పెట్టడం గాజుపలకలు, కెమికల్స్ ఇంత గందరగోళం, అవసరమా? దీన్ని సులభతరం చేయాలి. అలా చేస్తే అది మంచి వ్యాపారం అవుతుంద”ని అరేబియన్ ఐలాండ్స్ రియల్ ఎస్టేట్ పక్కన పెట్టేసాడు. కెమెరా ఉపయోగించే ఈ **వెట్ గ్లాస్ బదులుగా డ్రై ప్లేట్స్** పై పరిశోధనలు చేయాలనుకున్నాడు. కానీ జార్జ్ కి కెమిస్ట్రీ పాఠాలు రావు.

ఫోటోగ్రఫీ సాంకేతిక కేంద్ర స్థానం లండన్. ప్రపంచ పారిశ్రామిక రాజధాని. డ్రై గ్లాస్ ప్లేట్స్ గురించి చాలా చోట్ల ప్రయోగాలు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లో లండన్ నుంచి వచ్చే ‘ఫోటోగ్రఫీ’ మ్యాగజైన్ కొన్నాడు. కొన్ని అడ్రస్‌లు పట్టుకున్నాడు. వాళ్ళతో ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలు పెట్టాడు. గాజు పలకలు, కెమికల్సు అద్దడంపై ప్రయోగాలు ప్రారంభించాడు. ముందుగానే వాటికి పూత పూసి వాటిని పొడిగా చేసి ఆ పొడి గాజు పలకలు తయారుచేసి వాటిని కెమెరాలో వాడాడు. అతని చేస్తున్న ప్రయోగశాల వాళ్ళ వంటిల్లు.

పగలంతా బ్యాంకులో గుమస్తా పని, ఇన్సూరెన్స్ పాలసీలు అమ్మడం, వచ్చిన డబ్బుతో కెమికల్స్ కొని రాత్రంతా ప్రయోగాలు. ఇలా రోజులు, వారాలు, నెలలు సంవత్సరాలు, రెండేళ్లు కష్టపడ్డాడు. రాత్రంతా పనిచేసి బట్టలు కూడా మార్చుకోకుండా అట్లాగే వంటింట్లో నేల మీద పడుకుని నిద్రపోయేవాడు.

జార్జ్ ఈస్ట్‌మన్ పరిశోధనలు రెండేళ్ల తర్వాత ఫలించాయి. డ్రై ప్లేట్ చేయగలిగాడు. అంతటితో ఆగకుండా ఒక అడుగు ముందుకేసి రసాయనాలు అద్దడం కాకుండా ఒక రోలర్ యంత్రాన్ని కనిపెట్టి వాటిని మాస్ ప్రొడక్షన్ చేయగలిగాడు. రెండేళ్ల శ్రమ ఫలితంగా **డ్రై ప్లేట్స్**, కెమికల్ పూసే **రోలర్ యంత్రము** జార్జ్ ఈస్ట్‌మన్ ఆవిష్కరణలు. ఇతర దేశాల్లో కూడా డ్రై ప్లేట్స్ చేస్తున్నారని కెమికల్స్ పోసే రోలర్ యంత్రానికి, పేటెంట్ హక్కులకు లండన్‌లో తీసుకున్నాడు. అక్కడి నుంచి అమెరికాకు వచ్చి 1880 మొదట్లోనే రోలర్ యంత్రానికి పేటెంట్ తెచ్చుకున్నాడు. ఈ పేటెంట్ ఒరిజినల్స్ కూడా మనం ఇప్పుడు ఇంటర్నెట్లో చూడొచ్చు. పేటెంట్ రిజిస్టర్ అయింది. డ్రై ప్లేట్స్‌ని మాస్ ప్రొడక్షన్ కోసమని 1880 మధ్యలోనే రాంచెస్టర్‌లో రెండు గదుల ఫ్యాక్టరీ ప్రారంభించాడు.

1880 డిసెంబర్ కల్లా ఈస్ట్‌మన్ ట్రేడ్‌మార్క్ ఉన్న డ్రై ప్లేట్స్ న్యూయార్క్‌లో అందరు డీలర్స్ దగ్గర అమ్మ సాగారు. తొందర్లోనే ఆర్డర్లు ఎక్కువ అయ్యాయి పరిశ్రమ విస్తరణ అవసరం వచ్చింది. పదిమంది ఉద్యోగులను పెట్టుకున్నాడు. తను ఉద్యోగం మానలేదు. బ్యాంకులో ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు.

కంపెనీకి ఇంకా పెట్టుబడి అవసరమైంది. విస్తరణకు భాగస్వామి దొరికాడు. ఆ రోజుల్లోనే వీళ్ల ఇల్లు కాలిపోయింది. బోర్డింగ్ హోమ్‌లో భోజనం చేసే హైన్రీ స్ట్రాంగ్ గారి ఇంటికి వెళ్లి అక్కడ ఉన్నారు. హెన్రీ స్ట్రాంగ్ జార్జ్ ఈస్ట్‌మన్ కంటే 16 సంవత్సరాలు పెద్దవాడు. ఆయన డక్కా మొక్కీలు తిని నౌకల్లో పనిచేసి వచ్చాడు. ఆయన ఐదు వేల డాలర్లు ఇచ్చి ఆ కంపెనీలో భాగస్వామి అయ్యాడు.

అలా ప్రారంభమైన ఈస్ట్‌మన్ హైన్రీ స్ట్రాంగ్ స్నేహం, భాగస్వామ్యం చిట్టచివరి వరకు దశాబ్దాలపాటు సాగింది. రకరకాల కంపెనీలు. వందల మిలియన్ల డాలర్ల వ్యాపారం అయ్యాక కూడా జీవితాంతం కొనసాగింది.

మళ్ళీ 1881 ప్రాంతాలకు వస్తే ఈస్ట్‌మన్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. రావాల్సిన పదోన్నతి రానందున ఉద్యోగానికి రాజీనామా చేశాడు. తయారు చేస్తున్న డ్రై ప్లేట్స్‌కి గిరాకీ బాగా పెరిగింది. పెద్దవాడైపోయాక బిజినెస్ సూత్రాలు నేర్చాడు. వ్యాపారవేత్తలు ఎప్పుడూ వ్యాపారంలో ఇంకా కొత్తగా ఏం చేయాలి? మరింతగా ఎలా అభివృద్ధి చేయాలి? అని నిరంతరం ఆలోచించాలి. అప్పుడే అతను నిజమైన వ్యాపారవేత్త అవుతాడు అని నమ్మాడు. ఇంకొక ఆలోచన: ఫోటో తీయడానికి గాజు పలకలు రసాయనాలు ఇవి వాడుతున్నాం కదా ఇవే ఎందుకు వాడాలి? గాజు పలకలు, పూసే కెమికల్స్ బదులుగా మోత తగ్గేవి కావాలి, కావాలి. ఆ దిశలో ప్రయోగం ప్రారంభించాడు.

జార్జ్ ఈస్ట్‌మన్ **ఫోటోగ్రఫీ ఫిలిం** తయారు చేశాడు. అది మడత పెట్టగలిగేది. గాజుపలకలా గట్టిగా ఉండదు. దాన్ని మరింత అభివృద్ధి చేసి అట్ట బదులు పారదర్శక ఫిలిం చేశాడు. ఈ రెండింటికీ 1884లో పేటెంట్ తీసుకున్నాడు. విలియం వాకర్ ప్రతిభను గుర్తించి తన కంపెనీలో భాగస్వామిగా తీసుకున్నాడు. వాళ్ళిద్దరూ కలిసి తయారు చేసింది కెమెరాలు వాకర్ గాడ్, గిస్మన్ ఇద్దరి పేరు మీద ఉన్న పేటెంట్‌ని కూడా మనం ఇప్పుడు ఇంటర్నెట్లో చూడొచ్చు. ఏ పరిశోధన ఫలితాలైనా ప్రపంచానికి పరిచయం చేయాలంటే లండన్ వెళ్లాల్సిందే. మళ్ళీ లండన్ వెళ్ళాడు. ఇంకా కెమెరాలు ప్రొఫెషనల్స్ (వృత్తి నిపుణులు) చేతుల్లోనే ఉన్నాయి, మామూలు వాళ్ళ దగ్గరికి రాలేదు. పెద్ద పెట్టెలంత సైజు ఈ కెమెరా స్వరూపాన్ని మార్చాలి, కెమెరాను అందరికీ అందుబాటులోకి తేవాలి. ఔత్సాహికులు

కూడా వీటిని వాడాలి. ఇలా తీవ్రంగా ఆలోచించి ఆ దిశలో ప్రయోగాలు ప్రారంభించారు. హైస్కూల్ కూడా దాటని కుర్రవాడు, ఏ సైన్సు సబ్జెక్టుని అభ్యసించని బాలుడు ఇంత దూరం వచ్చాడు. ఇంకా ముందుకు వెళ్లలేడా? వెళ్ళాడు.

1888 సంవత్సరానికి నాలుగేళ్ల పాటు కష్టపడి అరచేతిలో పెట్టే చిన్న **బాక్స్ కెమెరా** తయారు చేశాడు. నాలుగేళ్ల క్రితం ఫిలింకి, రోలర్కి, పేటెంట్ తీసుకున్నాడు. ఆ రెండిటిని బాక్స్‌లో పెట్టి చూపాడు. అద్భుతం! ఇప్పుడు కెమెరాని చేత్తో పట్టుకోవచ్చు. మోత బరువు లేదు, గాజుపలకలు, రసాయనాలు అవసరం లేదు. ఫోటోల నాణ్యత పరవాలేదు.

**అలా ఆవిర్భవించింది ప్రపంచంలోనే మొట్టమొదటి హ్యాండ్ హెల్డ్ కెమెరా.** ఇంతవరకు తయారు చేసింది కెమెరా, లోపల ఉపయోగించే భాగాలు. 1888 వచ్చేసరికి మొత్తం కెమెరానే కుదించేశాడు. ఈ కొత్త పరికరానికి పేరు ఆలోచించాడు. “ఇదిగో, నేను సృష్టించిన కెమెరా. నేను ప్రపంచాన్ని జయించబోతున్నాను. ఇక మన కష్టాలన్నీ తీరిపోయినట్లే. దీనికి ఏం పేరు పెడితే బాగుంటుందో చెప్పు అమ్మా!” అని తన ఆనందాన్ని పంచుకున్నాడు. అమ్మ ఎంతో ఆనందించింది. భర్త చనిపోయినప్పటి నుంచి ఈస్ట్‌మాన్ ఎన్ని కష్టాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చాడో ఆమె అనుక్షణం గమనిస్తూనే ఉంది. 34 సంవత్సరాలు వయసు. ఈ ప్రయోగం ఫలించింది కదా! ఇప్పుడైనా పెళ్లి చేసుకుంటాడేమోలే అనుకుంది. ఈస్ట్‌మాన్‌కి ‘కె’ అనే అక్షరం చాలా ఇష్టం. తల్లీ కొడుకులు ఆలోచనల నుంచి వచ్చిన పేరు **కొడాక్**. పలకడానికి చాలా తేలిగ్గా ఉంది. కొత్తగా ఉంది. అర్థం లేదు అయినా పర్వాలేదు. సెప్టెంబర్ 1888లో **పేటెంట్** మంజూరు అయ్యింది.

మళ్లీ లండన్ వెళ్లి అక్కడ విడుదల చేశాడు. మార్కెట్లో అది రావడమే గొప్ప సంచలనం. **ఇదేంటి కెమెరా ఇంత చిన్నగా కూడా ఉండొచ్చా! మనం కూడా వాడొచ్చా! ఎవరు పడితే వాళ్ళు కొనుక్కోవచ్చా?** అని అందరూ ఆశ్చర్యపోయారు, కొనడానికి విరగబడ్డారు. **ఖరీదు కేవలం 25 డాలర్లు.** దాంతోపాటు 100 ఫోటోలకి సరిపడా ఫిలిం లోడ్ చేసి ఇచ్చేవాళ్ళు. 100 ఫోటోలు తీయడం అయ్యాక మొత్తం కెమెరా మాకు పంపండి, మేము వాటిని ప్రింట్లు వేసి మరొక 100 ఫోటోలకి సరిపడా ఫిలిం లోడ్ చేసి అన్నిటినీ కలిపి మీకు వెనక్కి పంపిస్తాం. దీనంతటికీ మీరు చెల్లించాల్సింది కేవలం 10 డాలర్లు మాత్రమే. ఇది ఈస్ట్‌మన్ వ్యాపార వ్యూహం.

మీరు బటన్ నొక్కండి. మిగతాదంతా మేము చూసుకుంటాం. ఇది ‘కొడాక్’ నినాదం.

ఈస్ట్‌మన్ కొడాక్ కంపెనీని ప్రారంభించి దాని పేరు మీద ఈ అరిచేతిలో పట్టే కెమెరాలు ఉత్పత్తి ప్రారంభించాడు. భాగస్వామిగా పెట్టుబడి పెట్టాడు హైన్రీ స్ట్రాంగ్. రోలర్లు తయారు చేయడంలో సహాయం చేసిన విలియం వాకర్. ముగ్గురూ భాగస్వాములు. యూరోప్‌లోని అన్ని దేశాల్లో కూడా బ్రాంచీలు ప్రారంభించారు. కెమెరాను మొట్టమొదటిసారిగా విడుదల చేసిన 1888కి ఒక రెండేళ్ల ముందే ఒక కెమిస్ట్రీ కుర్రాడిని హెన్రీ రేషన్ బార్క్‌ని రిక్రూట్ చేసుకున్నాడు. అతను మూడేళ్లు కష్టపడి 1889 కల్లా లోపరహితమైన అత్యంత నాణ్యత కలిగిన ఫిలిం తయారు చేశారు.

ఆ రోజుల్లోనే థామస్ ఆల్వా ఎడిసన్ కదిలే బొమ్మల కోసం ఫిలిం తయారు చేసే ప్రయోగాలు చేస్తున్నాడు. ఈస్టమన్ కంపెనీలో తయారైన ఈ నైట్రేట్ ఫిలిం నాణ్యత అభివృద్ధి చేసిన ఫిలిం తర్వాత మూవీ కెమెరాల్లో ఫిలింకి అది ప్రాతిపదిక. 1890 మధ్యలో వచ్చేసరికి **ఈస్ట్‌మన్ కొడక్ కెమెరా కి ఊహించనంత గిరాకీ** పెరిగింది. దానికి తగినట్టుగానే **వినూత్న ప్రచార పద్ధతులు.** అమ్మాయి బొమ్మతో ఆవిడకి రకరకాల డ్రస్సులతో రకరకాల పెద్ద పెద్ద హోర్డింగ్స్ లండన్‌లో పెద్ద ఎలక్ట్రిక్ బిల్ బోర్డు ప్రచారం వ్యాపార సూత్రం: **ఉత్పత్తి చేయడం ఒకటే కాదు, దానికి తగిన ప్రచారం కూడా కల్పించాలి**. పుస్తకాలు చదివి నేర్చుకోలేదు. పట్టుదల గట్టి సంకల్పం నుంచి వచ్చినదే. అర్హతలు, అధికారాలు, డిగ్రీలు, పరిశోధనలు. అవి ఉంటే ఎన్నయినా సాధించవచ్చు. ఈస్ట్‌మన్ జీవితమే గొప్ప ఉదాహరణ.

ఆరు లక్షల కెమెరాలు అమ్ముడు పోయాయి. మొదట్లో 25 డాలర్లు ఖరీదు అంటే చాలా ఎక్కువ. అప్పట్లో నెలకి 8 డాలర్లు వస్తుండేది. ఒక్కొక్కళ్ళు అంటే మూడు నెలలు జీతం పెట్టి కొనాలి. ఐదారేళ్ళకి దాని ఖరీదు పది డాలర్లకు తీసుకొచ్చాడు. 1900 సంవత్సరం వచ్చేసరికి చిన్నపిల్లలు జేబులో పెట్టుకోగలిగే బ్రౌనీ కెమెరాను డాలర్‌కు అందించాడు. పరిశ్రమ **వ్యాపారం** సమస్యలు **పోటీదారులు.** సమస్యలను ఎదుర్కొన్నాడు ఈస్ట్‌మన్. తన దగ్గరకు వచ్చి నాణ్యత గల ఫిలిం రూపొందించడం రష్యన్ బాక్ అనే కెమిస్ట్రీ కుర్రాడు కొన్ని సంవత్సరాలు అయ్యేసరికి ఈస్ట్‌మన్ దగ్గర పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను తీసుకుని కంపెనీ నుంచి వెళ్ళి సొంత కంపెనీ పెట్టుకున్నాడు.

కాని దాన్ని ఎక్కువ కాలం నడపలేక వేరే కంపెనీకి అమ్మేశాడు. ఈస్ట్‌మన్ ఆ కంపెనీని కొని మళ్లీ పెటెంట్ తన వద్దకే వచ్చేలా చేసుకున్నాడు. ఈస్ట్‌మన్ యూరోప్‌లో ఇతని వ్యాపారం అభివృద్ధి కాకుండా కొన్ని జర్మన్ సంస్థలు అడ్డం పడ్డాయి. వాళ్లతో అతను భాగస్వామ్యం కుదుర్చుకున్నాడు. ఆ సమస్యను అధిగమించాడు. ఫ్యాక్టరీ పెరిగిన కొద్దీ ఉద్యోగస్తులు, కార్మికులు పెరిగారు. వేలాది మందయ్యారు. వాళ్ల సమస్యలను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ తిరుగులేని శక్తిగా ఎదిగాడు. ఈస్ట్‌మన్ అటు పని, ఇటు రీసెర్చ్, ఉత్పత్తి, ప్రచారం చూసుకునేవాడు. 20వ శతాబ్దం మొదట్లో అంటే 1910 వ సంవత్సరం వచ్చేసరికి విదేశాల్లో ముఖ్యంగా యూరప్‌లో బ్రాంచీలు స్థాపించాడు. అన్నీ విజయవంతంగా నడుస్తున్నాయి. వ్యాపారం ఎంతో అభివృద్ధి చెందింది, ఎన్నో విజయాలు సాధిస్తున్నాడు. ఈస్ట్‌మన్ మాత్రం వ్యక్తిగత ప్రచారాలకు చాలా దూరంగా ఉండేవాడు. ఆయనకి బాగా సన్నిహితులైన కొద్దిమందికి తప్ప అసలు అసలు ఎవరికి ఈస్ట్‌మన్ జీవితం, వ్యక్తిగత విషయాలు ఎవ్వరికి తెలిసేవి కాదు.

ఈస్ట్‌మన్ వ్యాపారంలో చాలా నిక్కచ్చిగా ఉండేవాడు. పదిమంది మధ్యలోకి వెళితే మాత్రం ముడుచుపోయేవాడు. ఎవరైనా కొంచెం కామెంట్ చేసినా ఎక్కువ బాధ పడేవాడు. ఇద్దరు ముగ్గురు ఎదురెదురుగా కూర్చుంటే వాళ్ళని ఎలాగైనా ఒప్పించగలిగేవాడు. వాళ్ళతో చర్చలు జరిపేవాడు. ఈ కాంప్లెక్స్‌లో నుంచి ఆయన బయటకు తీసుకొచ్చి హై సొసైటీలో కూడా సౌకర్యవంతంగా ఉండేలాగా చేసిన వ్యక్తి జార్జ్ డిక్‌మ్యాన్. జార్జ్ డిక్‌మ్యాన్, అతని భార్య జోసెఫ్ఫిన్ డిక్‌మాన్. వీళ్ళిద్దరూ అమెరికన్ దేశస్థులే, వ్యాపారరీత్యా లండన్‌లో స్థిరపడ్డారు. ఈస్ట్‌మన్ బిజినెస్ ట్రిప్స్ మీద లండన్ వెళ్ళినప్పుడు వీళ్లిద్దరు పరిచయం అయ్యారు. వాళ్లే ఈస్ట మనకి లండన్‌లో

'హాయ్ సొసైటీ'ని పరిచయం చేసి అలాంటి వాళ్ళతో ఎలా ఉండాలి? అక్కడ యాక్సెంట్ ఎలా ఉండాలి? ఎలాగ మాట్లాడాలి? ఇలాంటివన్నీ నేర్పారు. జార్జ్ డిక్‌మెన్ భార్య జోసెఫ్ఫిన్ డిక్‌మాన్ గొప్ప గాయని. ఈస్ట్‌మన్ వ్యాపారాల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సంగీతం అంటే విపరీతమైన ఆసక్తి, చెవి కోసుకునేవాడు. అందుకని ఈ జోష్ ఫిన్ అంటే ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. పరిచయం దగ్గర నుంచి కూడా జార్జ్ ఈస్ట్‌మన్ కి. జార్జ్ డిక్‌మెన్‌ని లండన్‌లో ఉన్న కొడక్ కంపెనీకి జనరల్ మేనేజర్‌ని కూడా చేశాడు. తర్వాత దురదృష్టవశాత్తు మూడు నాలుగు సంవత్సరాలకే జార్జ్ డిక్‌మెన్ హఠాత్తుగా మరణించాడు. జోష్ ఫిన్ అమెరికా వచ్చేసింది. వాళ్లు బాగా ఉన్నవాళ్లు. భర్త వదిలి వెళ్ళిన ఆస్తులు, భవంతులు చాలా నగరాల్లో ఉండే వాటన్నిటికీ జోష్ ఫిన్ వారసురాలు అయింది. ఆవిడ అమెరికా వచ్చేసాక ఈస్ట్‌మన్ తరచూ కలుస్తూ ఉండేవాడు. ఫ్యాక్టరీ పనుల్లో తల మునకలుగా ఉన్నప్పటికీ ఇంకొంచెం ఖాళీ వచ్చినా జోష్ఫిన్ దగ్గరికి వెళ్లడము, లేకపోతే ఆమె ఈస్ట్‌మన్ దగ్గరికి రావడం జరిగేది.

ఈస్ట్‌మన్ జీవితంలో చాలా దగ్గర అయిన స్త్రీలు ఇద్దరే. వాళ్ళ అమ్మగారు, వాళ్ళ అక్క, ఆ తర్వాత ఆయన స్నేహం చేసింది ఒక్క జోష్ఫిన్‌తోనే ఆయన జీవిత చరిత్ర వెనుక నుంచి ముందుకి, ముందు నుంచి వెనక్కి చదివినా ఈ ముగ్గురు మహిళలు మాత్రమే కనిపిస్తారు. ఆయన జీవితంలో ఒకానొక సమయంలో జోస్ ఫిన్ జార్జ్ ఈస్ట్‌మన్ వివాహం కూడా చేసుకుంటారేమో అని అందరు అనుకున్నారు. కానీ అలా జరగలేదు. వాళ్ల స్నేహం స్నేహం గానే ఉండిపోయింది. ఈస్ట్‌మన్ బ్రహ్మచారి గానే మిగిలిపోయాడు. జోసెఫ్ పట్ల ఆయనకున్న ఆరాధన భావాన్ని మనసులోనే దాచుకున్నాడు. వ్యక్తిగతంగా ఏమాత్రం మచ్చలేని వ్యక్తిగా జీవించాడు ఈస్ట్‌మన్.

1902లో ఆయన సంపాదన పెరగడం ప్రారంభించాక రాంచెస్టర్‌లోనే 10 ఎకరాల భూమి కొని పెద్ద భవంతిని నిర్మించుకున్నాడు. మూడేళ్లు పట్టింది. 35 వేల చదరపు అడుగుల్లో 50 గదుల ఇల్లు. పది ఎకరాల్లో పూల మొక్కలు, పళ్ళచెట్లు, పశువులు, వ్యవసాయం, అదంతా ఒక చిన్ననగరంలా ఉండేది. ప్రస్తుతం అది మ్యూజియం. ఎవరైనా రాంచెస్టర్ వెళితే తప్పనిసరిగా చూడొచ్చు. ఈస్ట్‌మన్ నివసించిన ఇల్లు. 1902 లో మొదలు పెడితే 1905లో దాని నిర్మాణం పూర్తయింది. అప్పటికి ఆయన వయసు 50 సంవత్సరాలు. అప్పటి వరకు ఈస్ట్‌మన్‌కి కావాల్సినవన్నీ వాళ్ళ అమ్మగారే చూస్తుండేది. వ్యాపారంలో ఒడిదుడుకులు ఎదురైతే అమ్మతో చర్చించేవాడు. కొడుక్కి ధైర్యం చెబుతూ ఉండేది. కొడుకు వన్ టైం మిలీనియర్ అయినా తల్లి అతనికి కావాల్సిన మేజోళ్ళు, స్వెటరు స్వయంగా అల్లుతూ ఉండేది. కొడుకు ఏమైనా బహుమతులు తెచ్చినా తీసుకునేది కాదు.

కొడుకు ప్రపంచ ఫోటోగ్రఫీ పరిశ్రమను గుప్పెట్లో పెట్టుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త. అయినా తల్లి మాత్రం అతి సాధారణ మాతృమూర్తిగానే జీవితం గడిపేది. చివరి రోజుల్లో అనారోగ్యం వల్ల చక్రాలకు పరిమితమైపోయింది. 1907 అక్టోబర్‌లో ఆమె చనిపోయింది. ఈస్టమన్ చిన్నపిల్లాడి లాగా ఏడ్చాడు. మిత్రులందరు ఓదార్చడానికి వచ్చారు. అతడ్ని చూసి ఆశ్చర్యపోయారు. ఏమిటి ఇంత బిజినెస్‌మాన్ తల్లికోసం ఇంతలా ఏడుస్తున్నాడని ఆశ్చర్యపడ్డారు.

ఆయన అనుబంధం తల్లితో జీవితాంతం పెనవేసుకుంది. అప్పటికి అతను వ్యాపారాల్లోకి దిగి 27 సంవత్సరాలు అయింది. 1910 నుంచి ఈస్ట్‌మన్ ఒకవైపు వ్యాపారంలోని సవాళ్లనే ఎదుర్కొంటూ తన జీవితంలో మరో కోణానికి తెర తీశాడు. ఇది ఈస్ట్‌మన్ జీవితంలో ప్రముఖ, స్ఫూర్తిదాయక అంశం. తన ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం ఒక సేవింగ్స్ బ్యాంక్‌ని ప్రారంభించాడు. కార్మికుల సంక్షేమ శాశ్వతనిధిని ఐదు మిలియన్లు బ్యాంకులో డిపాజిట్ చేశాడు. కార్మికుల జీతాలను, డివిడెండ్ అనే విభిన్న పద్ధతిని తొలిసారిగా ప్రవేశపెట్టాడు. ప్రతి ఏడాదీ కంపెనీ లాభాల్లో కొంతభాగం కార్మికులకు డివిడెండ్ ఇచ్చేవారు. 1919లో తన పేరు మీద ఉన్న పదివేల షేర్లని వాటి మూలధరకే అంటే మార్కెట్లో 600 డాలర్లు ఉంటే వంద డాలర్లకే కార్మికులకు అందరికీ పంచేసాడు. అదీ అమ్మగా వచ్చిన డబ్బుని కూడా మళ్ళీ కార్మికుల కోసం పెన్షన్,  ఇన్సూరెన్స్, లాంటి వాటి కోసం ఒక నిధిని ఏర్పాటు చేశాడు. తల్లి చనిపోయిన దగ్గర నుంచి తన ఆస్తిని సంవత్సర సంవత్సరం పెరుగుతున్న ఆదాయాన్ని, దానధర్మాలకు వినియోగించడం ఎక్కువ చేసాడు జార్జ్ ఈస్ట్‌మన్.

చనిపోయే చివరి నిమిషం వరకు ఇచ్చిన విరాళాలు, చేసిన దానాలు మొత్తం 100 మిలియన్లు పైగా ఉంటాయి. యూనివర్సిటీ ఆఫ్ అలాబామా, హంప్టన్ యూనివర్సిటీ వర్జినియా, రాంచెస్టర్ అఫ్ టెక్నాలజీ, ఈస్టమన్ డెంటల్ డిస్పెన్సరీ, సెంటర్ ఫర్ గవర్నింగ్ పాలసీ, మ్యూజిక్ హాలు లండన్‌లో అలాగే మిగతా యూరోప్ నగరాల్లో ఉచిత ఆసుపత్రులు ఇప్పటికీ ఈస్టమన్ దాతృత్వానికి, ఔదార్యానికి నిదర్శనాలుగా నిలిచి ఉన్నాయి.

1920 లో కంపెనీలో పదవి విరమణ చేశాడు. ఆయనకి రావాల్సిన రాయల్టీ వస్తూనే ఉంది. ప్రతి సంవత్సరం మిలియన్ల డాలర్లు. 1924లో తనకు మిగిలిన కంపెనీ షేర్స్ అన్నిటిని నాలుగు యూనివర్సిటీలకు రాసి ఇచ్చేశాడు. ఇన్ని దానాలు చేసినా ప్రతి సంవత్సరం ఆదాయం పెరుగుతూనే ఉంది. ఇంత ధనవంతుడైనప్పుడు కూడా జార్జ్ ఈస్ట్‌మన్ చాలా చిన్న చిన్న పనుల్లో ఆనందాన్ని వెతుక్కునేవాడట. యూరోప్ వెళ్ళినప్పుడు కావాలని సైకిల్ మీద పల్లెటూర్లకు వెళ్లి అక్కడ పేద రైతుల ఇళ్లల్లో కూర్చుని వాళ్ళు చేసిన రొట్టెలు తింటుండేవాడు. 1926లో తన 72 సంవత్సరాల వయసులో ఆఫ్రికా వెళ్లి ఖడ్గమృగాలు, అడవి దున్నలని వేటాడేవాడు. ఒకసారి వేటాడి వెనక్కి వచ్చేటప్పుడు ఒక మిత్రుడితో అన్నాట్ట. "మళ్ళీ వంచన ప్రపంచానికి వెళ్తున్నాను" అని. ఆయన వివాహం గురించి ఎవరైనా అడిగితే మిత్రుల దగ్గర మాత్రం చెప్పేవాడట "పిల్లలు ఉండి ఉంటే ఈయన్ను దానాలు చేయనిచ్చే వాళ్ళు కాదు. ఒకవేళ ఈ ఆస్తి అంతా వాళ్లకి ఇచ్చేసి ఉన్నా వాళ్ళని చెడగొట్టిన వాడిని అయ్యేవాడిని" అనేవాడు.

1926 ప్రాంతాల్లోనే ఈస్ట్‌మన్‌కి వెన్నెముకకు సంబంధించిన వ్యాధి మొదలైంది. వైద్యులు చెప్పారు. ఇది అంత తొందరగా తగ్గేది కాదు అని. 1930 వచ్చేసరికి సరిగా నిలబడలేక పోయేవాడు. కాళ్లు ఈడుస్తూ నడిచేవాడు. 1931 నుంచి ఆ వ్యాధి ఇతర శరీర భాగాలకు పాకడం మొదలైంది. చివరి సంవత్సరాల్లో వాళ్ళ అమ్మ చక్రాల కుర్చీకి పరిమితం అయిపోయి ఎన్ని బాధలు పడిందో చూశాడు. అవన్నీ గుర్తొచ్చాయి. తను కూడా ఇంకా ఇలాగే కొనసాగితే ఎవరి మీదనో ఆధార పడాల్సి వస్తుంది. ఆలోచన చేసే శక్తి, జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోవచ్చు. అలా జీవించడం అనవసరం అనుకున్నాడు.

చిట్టచివరికి ఆయన తనకి తానుగా నిశ్చయించుకున్న చిట్టచివరి రోజు 1932 మార్చి 14. పొద్దున్నే ఫలహారం చేశాడు. చేయగానే పియానో వినడం అలవాటు. దాని కోసం ఒక పియానో వాయించే అమ్మాయి ప్రత్యేకంగా ఉండేది. ఆరోజు మాత్రం పియానో వాయించడానికి వచ్చిన అమ్మాయిని 'ఈరోజు పియానో వద్దు, కాసేపు కబుర్లు చెప్పు" అన్నాడు. ఆమె అలాగే కూర్చుని వెళ్లేటప్పుడు వణుకుతున్న చేతులతో ఆమె చేతులు దగ్గరికి తీసుకునే ముద్దు పెట్టుకుని "నీకు ఎవరీ పియానో నేర్పారో కానీ ఆ గురువుగారికి నా ధన్యవాదాలు చెప్పు" అన్నాడు.

11గంటల ప్రాంతంలో ముందుగా చెప్పినట్లు లాయర్లందరూ వచ్చారు. అంతకుముందే ఆయన రాసిన విల్లులో కొన్ని మార్పులు, చేర్పులు చేశాడు. సాక్షి సంతకాలు పెట్టారు, అలా సాక్ష్య సంతకాలు పెట్టే వాళ్ళకి ఆయన బంగారంతో చేసిన పది డాలర్ల నాణెం ఇవ్వడం అలవాటు. ఆరోజు మాత్రం సాక్షి సంతకం పెట్టిన వాళ్ళకి రెండు 10 డాలర్ల బంగారు నాణేలు ఇచ్చాడు. వాళ్ళు వెళ్ళగానే తలుపేసుకున్నాడు పక్కనే బంగారం పెట్టెలో ఉన్న సిగరెట్ తీసాడు. వెలిగించి చివరిసారిగా గుండెల నిండా పీల్చాడు. సిగరెట్ హ్యాండ్ ట్రేలో పెట్టి నలిపేశాడు. కళ్ళజోడు తీసి టేబుల్ మీద పెట్టాడు. నైట్ డ్రెస్‌లోనే పక్కన ఉన్న మంచం మీద వెల్లికల పడుకున్నాడు. గుండె మీద తడి టవల్ వేసుకున్నాడు. ముందుగా పక్కనే ఉంచుకున్న పిస్టల్ తీసాడు. సరిగ్గా గుండెకు గురి పెట్టుకున్నాడు. ట్రిగ్గర్ నొక్కాడు.

ఒకే ఒక్క క్షణం. అంతా అయిపోయింది.

అంతకుముందు కూడా డాక్టర్లు వచ్చినప్పుడు అడుగుతూ ఉండేవాడట "నాకు గుండె ఎక్కడుందో కరెక్ట్‌గా చెప్పండి, నేను దాన్ని ఒక మార్క్ చేసి ఉంచుకుంటాను." అని బహుశా గుర్తు పెట్టుకొని ఉంటాడు. అందుకే సరిగ్గా తన గుండెల్లో గుండుని పేల్చుకున్నాడు. అతి బీదరికంలో బాల్యాన్ని ప్రారంభించి, కసిగా అనుకున్నది సాధించి, డిగ్రీలు చదివి పిహెచ్.డీలు తీసుకున్న శాస్త్రజ్ఞులకు ఏమాత్రం తీసిపోని పరిశోధనలు చేసి, ఫలితాలు సాధించి, వ్యాపారంలో డక్కా మొక్కీలు తిని, ప్రపంచ ఫోటోగ్రఫీ పరిశ్రమను శాసించిన ప్రాణాలను ఆయన స్వచ్ఛందంగానే అనంతవాయువుల్లో కలిపేసుకున్నారు. పిస్తోలు పేలిన శబ్దంవిని సహాయకురాలు గబగబా పైకి వచ్చింది. ఈస్టమన్ కళ్ళు పై కప్పు కేసి నిర్జీవంగా చూస్తున్నాయి గన్ పౌడర్ పడి చర్మం కాలకుండా గుండెల మీద వేసుకున్న ఆ తడి టవల్ ఇంకా ఆరలేదు. టేబుల్ మీద ఒక చిన్న పేపర్ పెట్టి ఉంది.

ప్రియ మిత్రులారా,

*నేను చేయవలసిన పని అయిపోయింది. ఇంకా వేచి ఉండటం ఎందుకు*?!

ఆయన బ్రతికున్న రోజుల్లో చాలామంది జీ.ఈ. అని పిలిచేవారు. అదే రాసి పెట్టాడు. చిట్టచివరిలో పక్కనే ఉన్న బాస్కెట్‌లో వాళ్ళ అమ్మ తనకోసం అల్లిన మేజోళ్ళు ఉన్నాయి. దట్ ఈజ్ ది యండ్ ఆఫ్ జార్జ్ ఈస్ట్‌మన్.

జీవితంలో ఎప్పుడైనా నిరాశగా అనిపిస్తే, జీవితం సవాల్ విసురుతోంది అనుకుంటే, స్ఫూర్తి కోసం అన్వేషిస్తుంటే, కచ్చితంగా తెలుసుకోవాల్సిన జీవిత చరిత్ర జార్జ్ ఈస్ట్‌మన్ ది. నా భావనతో మీరంతా

ఏకీభవిస్తారనుకుంటాను. ఆ తర్వాత 80 సంవత్సరాలు పాటు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో తాను అభివృద్ధి చెందుతూ, అనేక రికార్డ్స్ సృష్టించిన ఈస్టమన్ కోడాక్ కంపెనీ 2012 వరకు కొనసాగింది.

అక్షరీకరణ – పెద్ది సాంబశివరావు

2020 మే 12 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS